క్లుప్తంగా

గణపతి ఉత్సవాలకు రాట ముహూర్తం



కడియపులంకలో రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం పందిరి రాటలు ఏర్పాటు చేశారు. నిర్ణీత ముహూర్తానికి ప్రత్యేక పూజలు చేసి ఈ కార్యక్రమం జరిపారు. కడియపులంకలోని ముసలమ్మ ఆలయం వద్ద విద్యాలక్ష్మీ గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు రాటను పాతారు. దుళ్ల శివాలయం వీధిలోని లక్ష్మీగణపతి ఆలయ కమిటీ సభ్యులు కూడా రాటను పాతి ఉత్సవ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు.

డాక్టర్ శివరావుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ శివరావు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని శివ ఫిజియోథెరపీ క్లినిక్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ పి.శివరావుకు విశిష్ట వైద్యసేవారత్న జాతీయ అవార్డు లభించింది. విజయవాడ చిట్టినగర్‌లోని కామాక్షి విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం విశ్వకర్మ సేవాట్రస్టు ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ పుల్లేటి శ్రీకాంత్, సండూరి బాలబ్రహ్మచారి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. బొమ్మూరు, జేగురుపాడు, కేశవరం తదితర ప్రాంతాలలో ఆయన వైద్యసేవలు అందిస్తున్నారు.

బోధనేతర పనులతో భారం

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం బోధనేతర పనుల పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసి, విద్యాబోధన సక్రమంగా చేయడం లేదని అనడం విడ్డూరంగా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక ఎల్ఐసీ ఎంప్లాయిస్ హోమ్ మోడల్ కాలనీలో ఆదివారం రాష్ట్రస్థాయి ప్రాంతీయ వర్క్ షాప్ జరిగింది. దీనికి తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, విజయవాడ జిల్లాల యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు. ప్రసాద్ మాట్లాడుతూ పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను కించపరుస్తున్న పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

కంబాల చెరువు పార్కులో స్వచ్ఛభారత్



కంబాలచెరువు పార్కులో చెత్తను శుభ్రం చేస్తున్న జేసీఐ సభ్యులు

ప్రకాశం నగర్: జేసీఐ రాజమహేంద్రవరం స్టార్లప్స్ ఆధ్వర్యంలో స్థానిక కంబాలచెరువు పార్కులో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జేసీఐ స్టార్లప్స్ అధ్యక్షురాలు మోహన ప్రియ మాట్లాడుతూ ఈ వారం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా రెండో రోజు క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం నగరంలో వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయన్నారు. మన చుట్టుపక్కల ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా, నీరు కలుషితం కాకుండా చేసి ఈ జ్వరాల బారినపడకుండా రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జేసీ పావని పద్మావతి, సభ్యులు దుర్గాభవాని, సుజన్ గ్రేస్, భరణీ దేవి, దీపిక పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌టీ విభాగంలో బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం హెచ్ఐవీ పాజిటివ్ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి పీఎంపీ జిల్లా కో కన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు, డాక్టర్ మల్లాది అనూహ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారంతో తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రతినెలా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న బ్రైట్ సేవాసంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ, సంస్థ సభ్యులను అభినందించారు. పౌష్టికాహారంలో భాగంగా పిల్లలకు గోధుమ రవ్వ, ముర్రి ఉండలు, బెల్లం, రస్కులు, చోడిపిండి తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీహెచ్ ప్రదీప్ కుమార్, ఏ.ఉదయ్ కిరణ్, విశ్వనాథ్, సోమరాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా బడి పిల్లల సర్వే

- చేపట్టిన వలంటీర్లు
- ఇంటింటికీ వెళ్లి వివరాల నమోదు

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను అనుగుణంగా పనిచేస్తూ వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయం. వారు ఏ సర్వే చేపట్టినా నూటికి నూరుశాతం విజయవంతం చేస్తున్నారు. ఇప్పటివరకూ అందిస్తున్న సేవలకు అదనంగా మరో సర్వేను ఇటీవల చేపట్టారు. అదే గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వే. విద్యకు పేదరికం, ఆర్థిక పరిస్థితులు అడ్డు రాకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రతి విద్యార్థీ పాఠశాలలో ఉండాలన్నదే సంకల్పం. అందుకు అనుగుణంగా ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించింది.

సత్ఫలితాలు

గ్రామ సచివాలయ వలంటీర్లు, సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం నగరంలో సత్ఫలితాలను ఇచ్చింది. చదువుకోకుండా బయట తిరుగుతున్న పిల్లలను రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ గుర్తించింది. ఆ శాఖ సంబంధిత జిల్లా శాఖకు జాబితా పంపింది. దాని ఆధారంగా జిల్లా సమగ్ర శిక్ష అభియాన్, విద్యాశాఖ అధికారులు సమగ్ర సర్వే పూర్తి చేపట్టే బాధ్యతలు వలంటీర్లకు అప్పజెప్పారు. ఇందులో భాగంగా వంటీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించారు. బడి బయట ఉన్న పిల్లల స్థితిగతులపై ఆరా తీశారు. వారి కుటుంబ సభ్యులతో చర్చించారు. బడి మానేసేందుకు కారణాలను విశ్లేషించారు. అనంతరం వాటిని విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో పొందుపర్చారు.

సర్వే జరిగిందిలా..

కుటుంబ ఆర్థిక పరిస్థితులతో మధ్యలోనే చదువు మానేసిన 6 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లల వివరాలను రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు తెలుసుకున్నారు. బడి బయట పిల్లల సమాచారాన్ని సేకరించి విద్యాశాఖ రూపొందించిన మన బడికి పోదాం యాప్‌లో నమోదు చేశారు. సీఆర్పీలు, సమీకృత విద్యా ఉపాధ్యాయులు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సర్వేను పర్యవేక్షించారు. గ్రామ వలంటీర్లు సర్వేలో కీలక భూమిక పోషించారు. ఇటుక బట్టీలు, కర్మాగారాలు, బస్టాండ్లు, తండాలు, మత్స్యశాఖ, నివాస ప్రాంతాలు, పనిచేయడానికి అవకాశం ఉన్న అన్ని ప్రాంతాల్లో పర్యటించారు.

వలంటీర్ల సేవలు భేష్

వివిధ కారణాలతో పాఠశాలకు దూరమైన విద్యార్థుల వివరాల సేకరణలో వలంటీర్లు కీలక భూమిక పోషించారు. వారికి కేటాయించిన గృహాల పరిధిలో పరిస్థితులను సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీకి తెలపడంతో సర్వే ప్రక్రియ సులభతరంగా మారింది.




సంజీవనగర్‌లో సర్వే చేస్తున్న విద్యాకార్యదర్శి శివకుమార్



36వ డివిజన్‌లో సర్వే చేస్తున్న వలంటీర్ నాగ పద్మావతి, విద్యా కార్యదర్శి సుజాత



సర్వే చేస్తున్న వలంటీర్ నాగేంద్ర



478 గృహాలలో పూర్తి

48 డివిజన్ 90 సచివాలయ పరిధిలోని 478 గృహాలలో డ్రాపవుట్స్ పిల్లల కోసం సర్వే చేపట్టాం. ఆరు నుంచి 18 ఏళ్ల ఉన్న పిల్లలు, విద్యార్థులందరూ స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఈ డివిజన్ పరిధిలో డ్రాపవుట్స్ పిల్లలు ఎవరూ లేరు.

– ఎం.శివకుమార్, 90వ సచివాలయం విద్యాకార్యదర్శి

వంద శాతం సర్వే

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వే ద్వారా ఇంటింటికి వెళ్లి సర్వే వంద శాతం పూర్తి చేశాను. 36వ సచివాలయ పరిధిలో 300 గృహాలలో సర్వే పూర్తి అయ్యింది. అందరూ కూడా బడికి వెళుతున్నారు. ఎవ్వరూ డ్రాపవుట్స్ లేరు. సర్వే పూర్తి చేసిన సందర్భంగా ఎల్లో బ్యాడ్జ్ ఇచ్చారు.

– నాగేంద్ర, వలంటీర్, 36 సచివాలయం క్లస్టర్1

బీఎంపీ రూరల్ మండల కమిటీ ఎన్నిక



కమిటీని ప్రకటిస్తున్న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (బీఎంపీ) అసోసియేషన్ రాజమహేంద్రవరం రూరల్ మండల శాఖ నూతన కమిటీని పిడింగొయ్యి బాపూజీనగర్‌లో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ సిద్ధబాబు (సిద్దు) (హుకుంపేట), ప్రధాన కార్యదర్శిగా పైన వీర వెంకటేశ్వరరావు (కాతేరు), కోశాధికారిగా ఆర్.ఈశ్వర్ ప్రభు (హుకుంపేట), ఉపాధ్యక్షులుగా వీవీ రమణ (ధవళేశ్వరం), బి.సరోజిని దేవి (శాటిలైట్ సిటీ), జి.నాగమణి, కందుల రవి కుమార్ (డి బ్లాక్) జాయింట్ సెక్రటరీలుగా జి.శ్రీనివాస్, ఎస్వీ మోహన్, ఎంఎస్ నాయుడు, టి.సూర్య కృష్ణ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు గౌరీష్ బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కన్నా బత్తుల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

అనపర్తి: వినాయక చవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలనే ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు పాడాలని స్థానిక సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి సురేష్‌శర్మ అన్నారు. సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన కర్రి సుధాకర్‌రెడ్డి, అలివేలు దంపతులు పాల్గొని మట్టితో చేసిన గణపతి ప్రతిమల పంపిణీని ప్రారంభించారు. సమితి కార్యదర్శి రెడ్డి సతీష్, రెడ్డి రామ్మోహన్‌రావు, సర్వలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

గోశాలకు గిర్ ఆవు అందజేత

కడియం: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలకు రోజురోజుకూ భక్తులు పోటెత్తుతున్నారు. పలువురు దాతలు గోవులకు పశుగ్రాసాన్ని విరివిగా అందిస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన బీజేపీ మండల శాఖ ఉపాధ్యక్షుడు గారపాటి తాతబ్బాయి, సత్యవేణి దంపతులు రూ.30 వేల విలువైన గిర్ ఆవును ఆలయ ప్రధాన అర్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ, గోసాల కమిటీ సభ్యుడు పిండి నాగరాజుకు అందించారు. అలాగే ఆరునెలల పాటు తన కుటుంబ సభ్యులకు గల 50 సెంట్లు వ్యవసాయ భూమిలోని గడ్డిని గోశాలకు అందించనున్నట్లు తాతబ్బాయి తెలిపారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు గారపాటి వెంకటేశ్వరరావు, నాగేంద్ర కుమార్, చిక్కాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గోశాలకు గిర్ ఆవును అందజేస్తున్న దాతలు

సమాజమే సాహిత్యానికి పునాది

సీటీఆర్: కవుల సాహిత్యానికి పునాది సమాజమేనని నన్నయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ తెరపట్ల సత్యనారాయణ అన్నారు. కందుకూరి వీరేశలింగం ఆనంద వనంలో ఆదివారం కళాగౌతమీ సారస్వత పరిషత్ రచయితల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువత సాహిత్యంపై మక్కువ చూపాలన్నారు. తెలుగు భాషపై విద్యార్థులకు మక్కువ పెంచాలన్నారు. డాక్టర్ బేతా శారదాదేవి విఘ్నేశ్వరుని ప్రార్థనతో సభ ప్రారంభమైంది. కళాగౌతమి అధ్యక్షుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి నుంచి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ కళాగౌతమి స్థాపించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చేయబోయే ఉత్సవాల గురించి, ప్రముఖులు, పెద్దలు చేసిన సూచనలకనుగుణంగా సన్నాహాలు ప్రారంభిస్తామన్నారు. ఆర్థిక శాస్త్ర శాఖాధిపతి ఎంఎస్ ఫణి కుమార్, శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, ప్రముఖ కవయిత్రి డాక్టర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సంజీవరావు తదితరులు

రహదారిపై ఇరుక్కుపోయిన ఊక లారీ

గోకవరం: మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారున ప్రధాన రహదారిపై ఆదివారం ఊక లోడు లారీ ఇరుక్కుపోయింది. భారీ లోడుతో ఉన్న ఊక లారీ గోతిలో పడి ఇరుక్కుపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకకరించారు.



జగన్నాథపురం శివారులో ప్రధాన రహదారిపై ఇరుక్కుపోయిన ఊక లోడు లారీ

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు

పెదపూడి: ఈ నెల 12, 13న పెదపూడిలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో జట్ల ఎంపికలు నిర్వహించనున్నామని పెదపూడి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గిరి తెలిపారు. ఆయన ఆదివారం పెదపూడిలో మాట్లాడుతూ ఈ నెల 12న బాలుర విభాగంలో 14 నుంచి 17 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు తొమ్మిది క్రీడా విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, త్రోబాల్ వంటి వాటిలో ఎంపికలు జరుతాయన్నారు. 13న బాలికలకు 14 నుంచి 17 సంవత్సరాల వయసుగల వారికి ఎంపికలు జరుగుతాయన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



పాతమునగాల ఆలయంలో జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం పాత మునగాలలో వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ఠాపన ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక తాగునీటి చెరువు వద్ద ఇటీవల టీటీడీ ఆర్థిక సహకారంతో నిర్మించిన ఈ ఆలయాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మండపాక కోటేశ్వరరావు, నాగా గోవింద్, తోట సాయిబాబు, ఎంపీటీసీ చింతాకుల లోవరాజు పాల్గొన్నారు.



శ్రీకృష్ణపట్నం దుర్గామాత ఆలయంలో పూజలు

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో పునర్నిర్మించిన దుర్గామాత ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆదివారం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, కోలపాటి వెంకన్న, మందారపు దుర్గారావు, రౌతుల చక్రవర్తి, డి.సూర్యానారాయణ పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజలందరి హర్షం

- ఎంపీ భరత్ రామ్
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన, ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంపూర్ణ సంతోషం, సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం స్థానిక 37వ వార్డు కోరుకొండ రోడ్డులోని వీరభద్రపురం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద చిట్టి వెంపల తన మిత్రబృందంతో కలిసి ఎంపీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. చిట్టి తదితరులకు ఎంపీ భరత్ రామ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ ప్రజలు తామంతట తాము వైఎస్సార్ సీపీలో చేరడం అంటే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనకు నూరుశాతం మార్కులు వేసినట్లేనన్నారు. గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వం అందివ్వని సంక్షేమ పాలన జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు.

స్కాముల రాజా చంద్రబాబు

టీడీపీ చంద్రబాబు నాయుడు స్కాముల రాజా అని, పాపం పండి పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారని ఎంపీ అన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇస్తామని నమ్మించి, ఆ ప్రాజెక్టు ముసుగులో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని వివరించారు. చంద్రబాబు అవినీతి, అక్రమాలలో ఇదొకటని, అమరావతి భూముల స్కాం, పోలవరం ప్రాజెక్టులో నిధుల స్వాహా ఇలా అనేకం ఉన్నాయన్నారు. చంద్రబాబు నక్కజిత్తుల డ్రామాలను ఇంకా నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలిక శ్రీను, మార్తి లక్ష్మి, మజ్జి అప్పారావు, అజ్జరపు వాసు, పీతా రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జులు పోలు విజయలక్ష్మి, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, అరిగెల బాబు, దుంగా మంగా, బాలాజీ రెడ్డి, సుందర్ సింగ్ సోడదాసి పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ భరత్‌రామ్ తదితరులు

వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ హేమనళిని

రాజానగరం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ముఖ్యంగా కౌమార దశ బాలికలు ఈ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ హేమనళిని అన్నారు. మండలంలోని కొత్త వెలుగుబందలో ఆదివారం కౌమార దశ బాలికలకు, యువతులకు ఆరోగ్యం – పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ (దివాన్ చెరువు) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారిని చైతన్యపరిచారు. అలాగే గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

అనపర్తి: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్దిదారులందరికీ పారదర్శకంగా పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరం గ్రామ సచివాలయంలో ఆదివారం గ్రామ పరిధిలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ గిరడా గంగాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణారెడ్డి మాట్లాడుతూ వివక్ష లేని సంక్షేమ పాలనను అందిస్తున్న సీఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల ఆమోదం పొందాల్సి వచ్చేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ఎవరి సిఫారసులు, అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో అర్హులను ఎంపిక చేసి సంక్షేమ ఫలాలు గడప ముంగిటకే అందిస్తున్నారని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, వార్డు సభ్యులు నల్లమిల్లి వరలక్ష్మి, కర్రి రుక్మిణికుమారి, సచివాలయ కన్వీనర్లు నల్లమిల్లి సూర్రెడ్డి, మేడపాటి వాసు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు ఎన్‌సీసీ అవసరం

రాజానగరం: క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు దేశ సమైక్యత, సమగ్రతకు పాటుపడేలా యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ పాత్ర గణనీయమైనదని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 18వ బీఎన్ ఎన్‌సీసీ ఫైరింగ్ శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పద్మశ్రీ మాట్లాడుతూ ప్రతి కళాశాలలోను ఎన్‌సీసీ ఉండాలన్నారు. ఎన్‌సీసీలో చేరడం వలన భారతీయ పౌరుడిగా తన బాధ్యతలను తెలుసుకోవడంతోపాటు సమర్థంగా నిర్వహించే అవకాశం ఏర్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని గుర్తించి, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలలో చైతన్యం తీసుకురావొచ్చన్నారు. కర్నల్ వివేక్ సావన్ గౌర్ మాట్లాడుతూ పునీత సాగర్ అభియాన్ అంటే ఏమిటి, ఎప్పుడు ప్రారంభించారు అనే విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

జగన్ పాలనకు సంపూర్ణ మద్దతు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

సీతానగరం: సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కొండపల్లి దుర్గారావు, బుడంపర్తి రాము సమక్షంలో రఘుదేవపురానికి చెందిన బీసీ నాయకులు వంగూరి వెంకటరాజుతోపాటుగా అధిక సంఖ్యలో కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. రాజమహేంద్రవరం తన కార్యాలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా తెలుగుదేశం పార్టీ కోసం బీసీ నాయకులు వంగూరి వెంకట రాజు పని చేశారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు అందరూ ఆకర్షితులవుతున్నారన్నారు. దీంతో వైఎస్సార్ సీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. వెంకట రాజు సేవలను రానున్న వైఎస్సార్ సీపీ తప్పక వినియోగించుకుంటుందన్నారు. నియోజకవర్గంలో గడచిన నాలుగున్నరేళ్లలో అర్హత కలిగిన వారందరికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నియోజకవర్గం అభివృద్ధికి విశేష కృషి చేశామన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు చేసి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా